క్లుప్తంగా

ప్రజారోగ్యానికి పెద్ద పీట

మాచారెడ్డి: బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రజారోగ్యానికి పెద్ద పీట వేస్తోందని మాచారెడ్డి ఎంపీపీ లోయపల్లి నర్సింగరావు అన్నారు. మంగళవారం ఎల్లంపేటలో రూ.20 లక్షలతో నిర్మించనున్న ఆరోగ్య ఉప కేంద్రం భవనానికి భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దేశంలో ఎక్కడ లేని విధంగా సీఎం కేసీఆర్ రాష్ట్రంలో కంటి వెలుగు, బస్తీ, పల్లె దవాఖానాలు ఏర్పాటు చేసి ప్రజల ఆరోగ్యానికి భరోసా కల్పిస్తున్నారని కొనియాడారు.

వరి పొలాల పరిశీలన

నిజాంసాగర్(జుక్కల్): జక్కాపూర్ శివారులోని వరి పంట పొలాలను మంగళవారం ఏడీఏ నూతన్ కుమార్ పరిశీలించారు. కంకి నల్లి ఉధృతంగా ఉందని, నివారణకు టేబుకొనజోల్ లేదా ట్రిప్లాక్సి స్ట్రా బిన్ 100 గ్రాముల మందును ఎకరానికి పిచికారీ చేయాలని ఆయన రైతులకు సూచించారు. సర్పంచ్ బంజ కంశవ్వ, బీఆర్ఎస్ నాయకులు బ్రహ్మానంద రెడ్డి, ఏఈవో రేణుక తదితరులున్నారు.

ఆయిల్ పామ్ మొక్కలు..

నస్రుల్లాబాద్(బీర్కూర్): బీర్కూర్ మండలంలోని దామరంచ గ్రామానికి చెందిన రైతు ఉప్పలపాటి సుబ్బారావు కుటుంబ సభ్యులు 17 ఎకరాల్లో సాగు చేసిన ఆయిల్ పామ్ పంటను సోమవారం ఏడీఏ వినయ్ కుమార్ పరిశీలించారు. పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. ఆయన వెంట ఏఈవో శ్రావణ్ కుమార్, అనూష, భాను ప్రశాంత్, విశ్వతేజ ఆగ్రో కంపెనీ మేనేజర్ వేణు గోపాల్ ఉన్నారు.

పనుల్లో నాణ్యత పాటించాలి

రామారెడ్డి(ఎల్లారెడ్డి): ప్రభుత్వ నిధులతో చేపడుతున్న పనుల్లో కాంట్రాక్టర్లు నాణ్యత పాటించి, పది కాలాలపాటు ప్రజలకు ఉపయోగపడేలా చేయాలని రామారెడ్డి ఎంపీపీ దశరథ్ రెడ్డి సూచించారు. రామారెడ్డి ప్రభుత్వ ఆస్పత్రిలో జరుగుతున్న పనులను మంగళవారం వైస్ ఎంపీపీ రవీందర్ రావుతో కలిసి పరిశీలించారు. ఆయన వెంట పీహెచ్‌సీ వైద్యాధికారి సురేష్, తదితరులు పాల్గొన్నారు

గుండె సంబంధిత వ్యాధులపై అవగాహన

బాన్సువాడ: ఆరోగ్య సిబ్బందికి మంగళవారం బాన్సువాడ మాత శిశు సంరక్షణ ఆస్పత్రిలో గుండె సంబంధిత వ్యాధులపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా డీఆర్‌పీ సాయికుమార్ మాట్లాడుతూ.. రోగి లక్షణాలను గుర్తించి ప్రథమ చికిత్స చేయాలని సూచించారు. కార్యక్రమంలో డివిజన్ ఆరోగ్య బోధకులు దస్తీరాం, సాయిలు, ఆరోగ్య సిబ్బంది ఉన్నారు.

ఇఫ్తార్ విందులో ఎమ్మెల్యే

లింగంపేట(ఎల్లారెడ్డి): మండల కేంద్రంలోని పెద్ద మజీద్‌లో మంగళవారం రాత్రి ఎల్లారెడ్డి ఎమ్మెల్యే జాజాల సురేందర్ ఇఫ్తార్ విందులో పాల్గొన్నారు. ఈ సందర్భంగా రంజాన్ మాసంలో ఉపవాస దీక్షలు చేపట్టిన ముస్లింలతో కలిసి దీక్ష విరమించారు. మత గురువులతో కలిసి ప్రత్యేక ప్రార్థనలు చేశారు. బీఆర్ఎస్ నాయకులు సంతోష్‌రెడ్డి, దేవేందర్‌రెడ్డి పాల్గొన్నారు.

కంటి వెలుగు ప్రారంభం

నాగిరెడ్డిపేట(ఎల్లారెడ్డి): మాల్తుమ్మెదలో మంగళవారం కంటివెలుగు కార్యక్రమాన్ని స్థానిక సర్పంచ్ బారాది ప్రతిభ, నాగిరెడ్డిపేట ఎంపీపీ రాజ్‌దాస్, ఎంపీడీవో రఘుతో కలిసి ప్రారంభించారు. అనంతరం ఎంపీటీసీ నారాయణకు వారు కళ్లద్దాలను పంపిణీ చేశారు. కార్యదర్శి నర్సింలు, నాయకులు శ్రీనివాస్‌రెడ్డి ఉన్నారు.

తలమడ్లలో..

రాజంపేట: తలమడ్లలో కంటివెలుగు శిబిరాన్ని సర్పంచ్ యాదవరెడ్డి ప్రారంభించారు. ఉప సర్పంచ్ శ్రీనివాస్ గౌడ్, ఎంపీటీసీ నర్మాల రాజు, ఎంపీడీవో బాలకిషన్ పాల్గొన్నారు.

'అనాథలకు అండగా ఉంటాం'



కామారెడ్డి టౌన్: కరోనా మొదట విజృంభించిన కాలంలో మహారాష్ట్రలోని నాందేడ్‌కు చెందిన ఓ కుటుంబం, ముగ్గురు పిల్లలు, పిల్లల నానమ్మతో కలిసి జీవనోపాధి కోసం కామారెడ్డికి వచ్చారు. నాలుగు నెలల క్రితం భార్యాభర్తలు పిల్లలు, వారి నానమ్మను వదిలేసి వెళ్లిపోయారు. దీంతో వారు రోడ్డుపాలయ్యారు. కామారెడ్డిలో భిక్షాటన చేసుకుంటూ హరిజనవాడలో జీవనం వెల్లదీస్తున్నారు. ఈ సమాచారం తెలుసుకున్న జాతీయ మానవ హక్కుల కామారెడ్డి బృందం సభ్యులు వారిని కలిసి పండ్లను అందజేశారు. వారి సంరక్షణను చూసుకుంటామని చైల్డ్ రైట్స్ తెలంగాణ డైరెక్టర్ దాస్ ఎల్లం తెలియజేశారు.

ఘనంగా బోనాల పండుగ

లింగంపేట(ఎల్లారెడ్డి): మండల కేంద్రంలో మంగళవారం రేణుక ఎల్లమ్మ బోనాల పండుగ అంగరంగ వైభవంగా గౌడ కులస్తులు నిర్వహించారు. ఉదయం రేణుక మాత కల్యాణం జరిపించారు. సాయంత్రం గౌడ సంఘం ఆధ్వర్యంలో ఇంటింటికి బోనాలు తీసుకొని గ్రామంలోని ప్రధాన వీధుల గుండా ఊరేగించారు. ఆలయం చుట్టూ ఐదు సార్లు ప్రదక్షిణ చేసి అమ్మవారికి బోనాలు సమర్పించారు. మొక్కులు తీర్చుకున్నారు.

జేపీఎస్‌లను రెగ్యులరైజ్ చేయాలి



నస్రుల్లాబాద్‌లో స్థానిక ప్రజాప్రతినిధులకు..



పిట్లంలో నాయకులకు..



నాగిరెడ్డిపేట ఎంపీపీ, అధికారులకు వినతిపత్రాన్ని అందజేస్తున్న జేపీఎస్‌లు



బాన్సువాడలో ప్రజాప్రతినిధులకు..



కామారెడ్డి ఎంపీపీ ఆంజనేయులుకు..

తమను రెగ్యులరైజ్ చేయాలని కోరుతూ జిల్లా వ్యాప్తంగా మంగళవారం స్థానిక అధికారులు, ప్రజాప్రతినిధులకు జూనియర్ పంచాయతీ కార్యదర్శులు(జేపీఎస్‌లు) వినతిపత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా జేపీఎస్‌లు మాట్లాడుతూ.. ప్రభుత్వం తమను 2019లో మూడేళ్ల ప్రొహిబిషన్‌తో జేపీఎస్‌లుగా నియమించిందని తెలిపారు. తమ ప్రొహిబిషన్ కాలాన్ని ప్రభుత్వం మూడేళ్ల నుంచి నాలుగేళ్లకు పెంచినా ప్రభుత్వ నిర్ణయాన్ని గౌరవిస్తూ ప్రభుత్వ సంక్షేమ పథకాలను క్షేత్రస్థాయిలో అమలు చేశామని గుర్తు చేశారు. నేటితో ప్రొహిబిషన్ కాలం పూర్తవుతున్నందున తమను రెగ్యులర్ చేయాలని కోరుతున్నట్లు వివరించారు. దీంతో పాటు ఓపీఎస్‌లను సైతం జేపీఎస్‌లుగా గుర్తించాలన్నారు. – సాక్షి నెట్‌వర్క్

ఆలయ అభివృద్ధిపై ఎమ్మెల్యేకు వినతి



సదాశివనగర్(ఎల్లారెడ్డి): మండల కేంద్రంలోని పెద్దమ్మ ఆలయ అభివృద్ధికి తనవంతు కృషి చేస్తానని ఎమ్మెల్యే జాజాల సురేందర్ హామీ ఇచ్చినట్లు బీఆర్ఎస్ గ్రామ అధ్యక్షుడు, ముదిరాజ్ సంఘం మండలాధ్యక్షుడు పెసరి సాయిలు తెలిపారు. మంగళవారం ఎల్లారెడ్డి ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యేను కలిసి ఆలయ అభివృద్ధికి నిధులు కావాలని కోరారు. దీనికి ఎమ్మెల్యే సానుకూలంగా స్పందించినట్లు ఆయన పేర్కొన్నారు. ఉప సర్పంచ్ వంకాయల రవి, మండల కో–ఆప్షన్ అల్తాఫ్, తదితరులు పాల్గొన్నారు.

ఉత్సవాలకు పెద్దమ్మ ఆలయం ముస్తాబు

దోమకొండ: మండల కేంద్రంలోని పెద్దమ్మ ఆలయం 25వ వార్షిక ఉత్సవాలకు ముస్తాబైంది. ఈనెల 13వ తేదీ నుంచి 16వ తేదీ వరకు పెద్ద ఎత్తున ఉత్సవాలను నిర్వహించడానికి ఆలయ కమిటీ సభ్యులు ఏర్పాట్లు చేశారు. మొదటి రోజున ఉత్సవాలకు ప్రభుత్వ విప్ గంప గోవర్ధన్ హాజరవుతారని ఆలయ కమిటీ అధ్యక్షుడు లక్ష్మణ్ తెలిపారు.

బలగం సినిమా ప్రదర్శన

బలగం సినిమా ప్రజాదరణకు నోచుకోవడంతో జిల్లాలో పలుచోట్ల బహిరంగంగా ప్రదర్శిస్తున్నారు. స్థానిక వీడీసీ ప్రతినిధులు, నాయకులు గ్రామాల్లో ప్రదర్శించటానికి చొరవ తీసుకుంటున్నారు. కామారెడ్డి మండలం చిన్నమల్లారెడ్డి, పిట్లం మండలం చిల్లర్గి, నిజాంసాగర్ మండలం మహమ్మద్‌నగర్, భిక్కనూరు మండల కేంద్రంతో పాటు తిప్పాపూర్, పెద్దమల్లారెడ్డి, రామేశ్వర్‌పల్లి గ్రామాల్లో సినిమాను తెరలపై ప్రదర్శించారు. – కామారెడ్డి టౌన్/ కామారెడ్డి రూరల్/భిక్కనూరు/నిజాంసాగర్/పిట్లం



మహమ్మద్‌నగర్‌లో బలగం సినిమాను తిలకిస్తున్న గ్రామస్తులు



భిక్కనూరు మండల కేంద్రంలో..



పిట్లం మండలం చిల్లర్గిలో..

సమైక్యంగా ఉంటే ఏదైనా సాధించవచ్చు

- బీకేఎస్ నేత అంబీర్ ఆనంద్‌రావు

కామారెడ్డి రూరల్: రైతులు సమష్టిగా ఉంటే ఏదైనా సాధించవచ్చని భారతీయ కిసాన్ సంఘ్ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు అంబీర్ ఆనంద్‌రావు అన్నారు. భారతీయ కిసాన్ సంఘ్(బీకేఎస్) ఆధ్వర్యంలో తిమ్మక్‌పల్లిలో మంగళవారం రైతులకు అవగాహన సదస్సును ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రైతుల సమస్యలు, పవర్ కట్ సమస్యలు, వరి కొనుగోలులో తూకం సెంటర్ నిర్వహణ, భూమి పట్టాలు తదితర సమస్యలపై చర్చించారు. జిల్లా అధ్యక్షుడు వెంకట్ రెడ్డి పంట మార్పిడి, సేంద్రియ ఎరువుల గురించి వివరించారు. రిలయన్స్ ఫౌండేషన్ ప్రతినిధి వినాయక్ మాట్లాడుతూ..నూతన వ్యవసాయ పద్ధతుల గురించి వివరించారు.



అవగాహన కల్పిస్తున్న నాయకులు

'ఇంటింటికి బీజేపీ' విజయవంతం చేయాలి

ఎల్లారెడ్డిరూరల్(ఎల్లారెడ్డి): ఇంటింటికి బీజేపీ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు బాణాల లక్ష్మారెడ్డి అన్నారు. మంగళవారం ఎల్లారెడ్డిలో బీజేపీ కార్యకర్తల సమావేశం నిర్వహించారు. సమావేశంలో భాగంగా మహాత్మా జ్యోతిబా పూలే జయంతి నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతు ఇంటింటికి బీజేపీ కార్యక్రమంలో భాగంగా కేంద్ర ప్రభుత్వ పథకాల గురించి ఇంటింటికి తిరుగుతు ప్రజలకు వివరించాలని అన్నారు.

లింగంపేట మండల కేంద్రంలో..

లింగంపేట(ఎల్లారెడ్డి): మండల కేంద్రంలో మంగళవారం పల్లె పల్లె ఓటీసీ– ఇంటింటికి బీజేపీ కార్యక్రమం నిర్వహించినట్లు మండల పార్టీ అధ్యక్షుడు దత్తురాం తెలిపారు. ఈ సందర్భంగా ఇంటింటికి వెళ్లి కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం తెలంగాణకు అందిస్తున్న సంక్షేమ పథకాలను వివరించారు.

బరంగేడ్గిలో మిషన్ వాత్సల్య కార్యక్రమం

నస్రుల్లాబాద్(బీర్కూర్): బీర్కూర్ మండలంలోని బరంగేడ్గి అంగన్‌వాడి కేంద్రంలో మంగళవారం మిషన్ వాత్సల్య కార్యక్రమాన్ని బీజేపీ కార్యకర్తలు నిర్వహించారు. తల్లి, తండ్రి లేని చిన్నారుల వివరాలను నమోదు కార్యక్రమం చేపట్టారు. ప్రతి నెలా రూ.4 వేలు మిషన్ వాత్సల్య పథకంలో భాగంగా వస్తాయంటూ ప్రజలకు వివరించారు. పార్టీ మండల అధ్యక్షుడు నాగేళ్ల సాయిలు పాల్గొన్నారు.



జ్యోతీబా పూలే చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న బీజేపీ నాయకులు

కాంగ్రెస్‌తో ప్రతి ఒక్కరికీ న్యాయం



ప్రజలతో మాట్లాడుతున్న సుభాష్‌రెడ్డి

తాడ్వాయి(ఎల్లారెడ్డి): చిట్యాల, సంతాయిపేట్, సోమారం, సోమారంతండాలో మంగళవారం కాంగ్రెస్ ఎల్లారెడ్డి నియోజకవర్గ ఇన్‌చార్జి వడ్డేపల్లి సుభాష్‌రెడ్డి ఆధ్వర్యంలో హాథ్ సే హాథ్ జోడో యాత్ర కార్యక్రమంలో భాగంగా గడప గడపకు కాంగ్రెస్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..కాంగ్రెస్ పార్టీతోనే ప్రతి ఒక్కరికి న్యాయం జరుగుతుందన్నారు. నాయకులు మోహన్‌రెడ్డి, మనోహర్‌రెడ్డి, స్వామిరెడ్డి, జనార్దన్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌లో చేరికలు



కామారెడ్డి టౌన్: మాజీ మంత్రి షబ్బీర్ అలీ సమక్షంలో మంగళవారం ఆయా పార్టీలకు చెందిన నాయకులు కాంగ్రెస్ పార్టీలో చేరారు. జిల్లా పార్టీ కార్యాలయంలో వారికి పార్టీ కండువా కప్పి కాంగ్రెస్‌లోకి షబ్బీర్ అలీ ఆహ్వానించారు. రాబోయే ఎన్నికల్లో కాంగ్రెస్ అధికారంలోకి రావడం ఖాయమని ఆయన అన్నారు. కార్యక్రమంలో డీసీసీ అధ్యక్షుడు కైలాస్ శ్రీనివాస్, జిల్లా లీగల్ సెల్ చైర్మన్ దేవరాజ్, టీపీసీసీ రాష్ట్ర కార్యదర్శి ఇంద్రకరణ్ రెడ్డి ఉన్నారు.

అన్ని వర్గాల సంక్షేమమే కేసీఆర్ లక్ష్యం

- జుక్కల్ ఎమ్మెల్యే హన్మంత్ సింధే
- లచ్చన్‌లో బీఆర్ఎస్ ఆత్మీయ సమ్మేళనం

మద్నూర్: అన్ని వర్గాల ప్రజల సంక్షేమమే సీఎం కేసీఆర్ లక్ష్యమని జుక్కల్ ఎమ్మెల్యే హన్మంత్ సింధే అన్నారు. లచ్చన్‌లో మంగళవారం నిర్వహించిన బీఆర్ఎస్ ఆత్మీయ సమ్మేళనంలో పాల్గొని ఎమ్మెల్యే మాట్లాడారు. రైతు సమస్యలను పరిష్కరించిన ఘనత సీఎం కేసీఆర్‌కే దక్కుతుందని అన్నారు. కార్యకర్తలు, ప్రజల ఆశీర్వాదంతో మూడు సార్లు ఎమ్మెల్యేగా గెలిచానన్నారు. వెనుకబడిన ప్రాంతంగా పేరున్న జుక్కల్ నియోజకవర్గాన్ని బీఆర్ఎస్ ప్రభుత్వ సహాయంతో అభివృద్ధి చేశానని వ్యాఖ్యానించారు. నూతన మండలంగా ఏర్పడిన డోంగ్లీలో జూనియర్ కళాశాల, మద్నూర్‌లో డిగ్రీ కళాశాల త్వరలో ఏర్పాటు అవడం ఖాయమన్నారు. అనంతరం బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలందరిని గ్రామాల వారిగా పిలిపించుకొని ఎమ్మెల్యే మాట్లాడారు. అంతకు ముందు గ్రామానికి చెందిన పలువురిని పార్టీలోకి ఎమ్మెల్యే ఆహ్వానించారు. ఎంపీపీ లక్ష్మీబాయి, జెడ్పీటీసీ అనిత, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు బస్వీపటేల్, సర్పంచ్‌ల ఫోరం అధ్యక్షుడు సురేష్, మద్నూర్ విండోచైర్మెన్ శీనుపటేల్, కార్యకర్తలు పాల్గొన్నారు.



లచ్చన్‌లో మాట్లాడుతున్న ఎమ్మెల్యే సింధే

దళారులకు అమ్మి మోసపోవద్దు

మద్నూర్(జుక్కల్): రైతుల కోసం వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభిస్తున్నామని, రైతులు తక్కువ ధరకు దళారులకు అమ్మి మోసపోవద్దని ఎమ్మెల్యే హన్మంత్ సింధే, అదనపు కలెక్టర్ చంద్రమోహన్‌లు పేర్కొన్నారు. కుర్లాలో మంగళవారం ఎమ్మెల్యే, అదనపు కలెక్టర్ వరి కొనుగోళ్లను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. రైతులు వరి ధాన్యాన్ని ఆరబెట్టుకొని తగిన తేమ శాతం వచ్చిన తర్వాతే కొనుగోలు కేంద్రాలను తమ పంటను తీసుకురావాలని సూచించారు. ఆర్డీవో రాజాగౌడ్, తదితరులున్నారు.

నస్రుల్లాబాద్(బీర్కూర్): బీర్కూర్ మండలంలోని బరంగేడ్గి, బైరాపూర్ గ్రామాల్లో సోమవారం వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను స్థానిక ఎంపీపీ రఘు ప్రారంభించారు. మాజీ జెడ్పీటీసీ ద్రోణవల్లి సతీష్, ఏఈవో శ్రావణ్ కుమార్ పాల్గొన్నారు.



కుర్లాలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే, అదనపు కలెక్టర్, ఆర్డీవో

నిజాంసాగర్(జుక్కల్): మండలంలోని నర్సింగ్‌రావ్‌పల్లి చౌరస్తా వద్ద అచ్చంపేట సొసైటీ ఆధ్వర్యంలో వరిధాన్యం కొనుగోలు కేంద్రాన్ని అచ్చంపేట సొసైటీ చైర్మన్ కయ్యుం నర్సింహారెడ్డి ప్రారంభించారు. గ్రామ సర్పంచ్ సుబ్బురి సాయిలు, ఉప సర్పంచ్ విఠల్‌రెడ్డి, మండల నాయకులు దుర్గారెడ్డి, గైని విఠల్, తదితరులు ఉన్నారు.

జ్యోతీబా పూలేకు ఘన నివాళులు



నివాళులర్పిస్తున్న టీఎన్‌జీవో నేతలు నరాల వెంకట్‌రెడ్డి, సాయిలు



గోపాల్ పేటలో ..

విద్య, అంటరానితనం, స్త్రీ వివక్షపై అలుపెరగని పోరాటం చేసిన మహాత్మా జ్యోతీబా పూలే జయంతిని జిల్లా వ్యాప్తంగా వివిధ సంఘాలు, పార్టీల ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. జ్యోతీబా పూలే విగ్రహాలు, చిత్రపటాలకు పూలమాలలువేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ.. బడుగు, బలహీన వర్గాల అభివృద్ధి కోసం జీవితాంతం కృషి చేసిన మహనీయుడని కొనియాడారు. ఆయన చేసిన సేవలను స్మరించుకున్నారు. – సాక్షి నెట్‌వర్క్



టీపీటీఎఫ్ ఆధ్వర్యంలో .. ఉపాధ్యాయులు



బాన్సువాడలో..



జిల్లా కేంద్రంలో విద్యుత్ శాఖ కార్యాలయంలో..



ఎర్రాపహాడ్‌లో వైఎస్సార్‌టీపీ ఆధ్వర్యంలో..

వైద్యులు అందుబాటులో ఉండాలి



మద్నూర్(జుక్కల్): రోగులకు వైద్యం అందించడానికి వైద్యులు, సిబ్బంది ఎల్లవేళలా అందుబాటులో ఉండాలని డిప్యూటీ డీఎంహెచ్‌వో శిరీష పేర్కొన్నారు. డోంగ్లీ పీహెచ్‌సీలో మంగళవారం ఆమె తనిఖీ చేశారు. ఆస్పత్రిలో మందులు, కుక్క, పాము కాటుకు సంబంధించిన మందులు అందుబాటులో ఉన్నాయా లేవా అని ఆమె వైద్య సిబ్బందిని ప్రశ్నించారు. అనంతరం ఆస్పత్రిలో రోగులతో మాట్లాడి వైద్య సేవలపై ఆరా తీశారు. వైద్యురాలు రీతుపటేల్, సూపర్‌వైజర్ లక్ష్మి, సీనియర్ అసిస్టెంట్ నీల నాయక్, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

బీసీలకు 50 శాతం టికెట్లు ఇవ్వాలి

కామారెడ్డి అర్బన్: బీసీలకు వచ్చే ఎన్నికల్లో 50 శాతం టికెట్లు కేటాయించాలని సంఘం రాష్ట్ర అధ్యక్షుడు చందర్, టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డికి విజ్ఞప్తి చేసినట్లు సంఘం జిల్లా అధ్యక్షుడు ఆంజనేయులు తెలిపారు. మంగళవారం రేవంత్‌రెడ్డిని కలిసి సంఘం తరపున వినతి పత్రం అందజేసినట్లు పేర్కొన్నారు. ఎల్లారెడ్డి నియోజకవర్గం నుంచి బీసీలకు టికెట్ ఇవ్వాలని కోరినట్లు చెప్పారు.

సమాచారం..

13న ఉచిత వైద్య శిబిరం

ఎల్లారెడ్డి: పట్టణంలోని ప్రభుత్వ ఆస్పత్రిలో ఈనెల 13న భవన నిర్మాణ కార్మికులకు ఉచిత వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేసినట్లు భవన నిర్మాణ కార్మికుల సంఘం నాయకులు శ్యాం, సాయిలు, రజాక్, సాయిబాబాలు మంగళవారం తెలిపారు. కార్మికులు వారి లేబర్ కార్డు, ఆధార్ కార్డును వైద్య పరీక్షలు చేయించుకునేందుకు తీసుకురావాలని వారు కోరారు.

16న మోడల్ స్కూల్ ప్రవేశ పరీక్ష

సదాశివనగర్(ఎల్లారెడ్డి): మోడల్ స్కూల్‌లో ప్రవేశానికి ఈ నెల 16న(ఆదివారం) ప్రవేశ పరీక్ష నిర్వహించనున్నట్లు ప్రిన్సిపాల్ భానుమతి తెలిపారు. అర్హత పరీక్ష రాసే విద్యార్థులు గంట ముందు పరీక్ష కేంద్రానికి చేరుకోవాలని సూచించారు. ఆన్‌లైన్‌లో హాల్‌టికెట్లను డౌన్‌లోడ్ చేసుకోవాలన్నారు.

సంక్షిప్తం

వాహనాల తనిఖీ

తాడ్వాయి(ఎల్లారెడ్డి): మండల కేంద్రంలో కామారెడ్డి –ఎల్లారెడ్డి రోడ్డుపై మంగళవారం పోలీసుల ఆధ్వర్యంలో వాహనాలను తనిఖీ చేశారు. పలువురికి జరిమానాలు విధించారు.

విద్యార్థులకు వైద్య పరీక్షలు

భిక్కనూరు: మండల కేంద్రంలోని ప్రభుత్వ బీసీ వసతి గృహంలో విద్యార్థులకు వైద్య పరీక్షలు మంగళవారం నిర్వహించారు. స్థానిక పీహెచ్‌సీ వైద్యురాల యెమిమా పాల్గొన్నారు.

గ్రంథాలయానికి పుస్తకాల బహూకరణ

భిక్కనూరు: కాచాపూర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలోని గ్రంథాలయానికి మహనీయుల జీవిత చరిత్ర పుస్తకాలను మంగళవారం అంబేడ్కర్ యువజన సంఘం సభ్యులు బహూకరించారు. సర్పంచ్ సులోచన, మాజీ ఎంపీపీ తొగరి సుదర్శన్, అంబేడ్కర్ యువజన సంఘం సభ్యులు పాల్గొన్నారు.

ఒలంపియాడ్‌లో శ్రీ చైతన్య విద్యార్థుల ప్రతిభ

కామారెడ్డి రూరల్: ఎస్‌టీఎస్‌వో ఒలంపియాడ్ లెవెల్–2 పరీక్షల్లో కామారెడ్డి శ్రీ చైతన్య టెక్నో స్కూల్ విద్యార్థులు సత్తా చాటారు. వివిధ విభాగాల్లో ప్రతిభ చాటి 13 గోల్డ్ మెడల్స్ సాధించిన విద్యార్థులకు పాఠశాల తరపు నుంచి ప్రిన్సిపల్ స్వర్ణలత మంగళవారం బహుమతులు అందజేశారు.

సీపీఎస్ విధానాన్ని రద్దు చేయాలి

ఎల్లారెడ్డి: సీపీఎస్ విధానాన్ని ప్రభుత్వం రద్దు చేయాలని సీపీఎస్ సంఘం నాయకులు నాగరాజు అన్నారు. మంగళవారం ఎల్లారెడ్డిలో సీపీఎస్ నాయకులతో ఆయన మాట్లాడుతూ.. ఈనెల 16న కామారెడ్డిలో నిర్వహించే కానిస్టిట్యూషనల్ ర్యాలీని విజయవంతం చేయాలని ఆయన కోరారు.

'ఉపాధి' పథకాన్ని సద్వినియోగం చేసుకోండి

రాజంపేట: కూలీలు ఉపాధి హామీ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని స్థానిక ఎంపీడీవో బాలకిషన్ అన్నారు. మంగళవారం ఆరేపల్లిలో చేపడుతున్న ఉపాధి హామీ పనులను ఆయన పరిశీలించారు.

నీటి ఎద్దడి నివారణకు చర్యలు

భిక్కనూరు: బస్వాపూర్‌లో నీటి ఎద్దడి నివారణకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్లు సర్పంచ్ మంజులా మల్లారెడ్డి అన్నారు. మంగళవారం బస్వాపూర్‌లో జరిగిన గ్రామ పంచాయతీ పాలకవర్గం సమావేశానికి ఆమె అధ్యక్షత వహించి మాట్లాడారు. గ్రామంలో అన్ని వీధుల్లో సిమెంట్ రోడ్లు, మురుగు కాలువలు నిర్మించినట్లు తెలిపారు.

సీసీ రోడ్డు పనులు ప్రారంభం

నిజాంసాగర్(జుక్కల్): జుక్కల్ మండలం బస్వాపూర్‌లో సీసీ రోడ్డు నిర్మాణ పనులను మంగళవారం గ్రామ సర్పంచ్ రవి పటేల్ ప్రారంభించారు. సొసైటీ మాజీ చైర్మన్ రాజు పటేల్, బీఆర్ఎస్ నేత బస్వరాజ్ పటేల్ తదితరులు ఉన్నారు.

రేణుకా ఎల్లమ్మ ఆలయ వార్షికోత్సవం

భిక్కనూరు: జంగంపల్లిలో రేణుకాదేవి ఎల్లమ్మ ఆలయం ప్రథమ వార్షికోత్సవం మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గౌడ సంఘం ఆధ్వర్యంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు జరిపించారు.

కోటదుర్గమ్మ ఆలయంలో కుంకుమార్చనలు

బాన్సువాడ : పట్టణంలోని కోటదుర్గమ్మ ఆలయంలో మంగళవారం మహిళలు కుంకుమార్చనలు నిర్వహించారు. మహిళలు పెద్ద సంఖ్యలో వచ్చి ప్రత్యేక పూజలు చేశారు.